
సాక్షి
కామారెడ్డి
7
ఆదివారం । 30 । మార్చి । 2025



తారురోడ్డుగా మారేదెప్పుడో?
తాడ్వాయి మండలంలోని చందాపూర్ –కన్‌కల్ మార్గం కంకర తేలి అధ్వానంగా తయారయ్యింది.
- 9లో ▸



గరిష్టం/కనిష్టం
39.3 /20.8

వాతావరణం
ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఈదురుగాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు, రేపు బల్దియా కార్యాలయాలు ఓపెన్

కామారెడ్డి టౌన్ : ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరించడం కోసం సెలవు దినాల్లోనూ మున్సిపల్ కార్యాలయాలు తెరిచి ఉంటాయని అధికారులు తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి ఈనెల 31 చివరి రోజు కావడంతో సర్కారు ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. ఆదివారం ఉగాది, సోమవారం రంజాన్ ఉన్నా మున్సిపల్ కార్యాలయాలు తెరిచి ఉంటాయన్నారు. టౌన్‌ప్లానింగ్ కార్యాలయంలో సంప్రదించి ఎల్‌ఆర్‌ఎస్‌కు సంబంధించిన ఫీజు చెల్లించాలని టీపీవో గిరిధర్ సూచించారు.

రెండు రోజుల్లో 892 మంది..
కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో రెండు రోజుల్లో 892 మంది దరఖాస్తుదారులు ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించారు. ఇప్పటివరకు మొత్తం 2,896 మంది దరఖాస్తుదారులు ఫీజు చెల్లించారని అధికారులు తెలిపారు. వీటి ద్వారా కామారెడ్డి బల్దియాకు రూ. 6 కోట్ల ఆదాయం సమకూరిందన్నారు. బాన్సువాడలో 124, ఎల్లారెడ్డిలో 132 మంది దరఖాస్తుదారులు ఫీజు చెల్లించారని తెలిపారు.

27 మంది గైర్హాజరు

కామారెడ్డి టౌన్ : జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం నిర్వహించిన పరీక్షకు 12,579 మంది విద్యార్థులకుగాను 12,552 మంది హాజరయ్యారు. 27 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షలను జిల్లా విద్యాశాఖ అధికారి రాజు పర్యవేక్షించారు.

'కొనుగోళ్లలో సమస్యలు లేకుండా చూడాలి'



కామారెడ్డి క్రైం : ఎలాంటి సమస్యలు రాకుండా ధాన్యం కొనుగోలు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోళ్లపై గ్రామ సంఘాల అధ్యక్షులు, సబ్ కమిటీ సభ్యులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన విధంగా ఈసారి మహిళా సంఘాలకు ఎక్కువ కొనుగోలు కేంద్రాలను కేటాయించామన్నారు. గతంలో జిల్లాలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో 27 కేంద్రాలు ఉండేవని, ఈసారి మొత్తం 183 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. వడగండ్ల వానలు పడే అవకాశాలు ఉన్నందున టార్పాలిన్‌లను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, డీఆర్డీవో సురేందర్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రాజేందర్, జిల్లా సహకార అధికారి రామ్మోహన్, మార్కెటింగ్ అధికారి రమ్య, మహిళా సంఘాల అధ్యక్షులు, ఏపీఎంలు, సీసీలు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

జిల్లాలో స్పేస్ సెంటర్!

- కామారెడ్డి ప్రాంతంలో ఏర్పాటుకు అడుగులు
- అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించిన సీఎం రేవంత్‌రెడ్డి
- స్థలం కేటాయిస్తామని ప్రకటన

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)తో కలిసి పనిచేస్తున్న ధ్రువ అంతరిక్ష పరిశోధన సంస్థకు సంబంధించిన కేంద్రం కామారెడ్డి జిల్లాలో ఏర్పాటు కానుంది. ధ్రువ అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా ఉపగ్రహాల అభివృద్ధి, ప్రయోగాలు చేస్తోంది. ఆ సంస్థ ఆధ్వర్యంలో కామారెడ్డి పట్టణానికి సమీపంలో పరిశోధన సంస్థ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దీనిపై స్థానికంగా హర్షం వ్యక్తమవుతోంది. సీఎం ప్రకటనకు సంబంధించిన వీడియోలు స్థానికంగా వైరల్ అవుతున్నాయి.

జిల్లా కేంద్రానికి సమీపంలో జంగంపల్లి, క్యాసంపల్లి గ్రామాల పరిధిలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూములు అందుబాటులో ఉన్నాయి. పరిశోధన సంస్థ ఏర్పాటుకు వంద ఎకరాలకుపైగా స్థలం అవసరం అవుతుందని భావిస్తున్నారు. అయితే అధికారికంగా ఎలాంటి ఆదేశాలు వెలువడనప్పటికీ అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనతో స్పేస్ సెంటర్ ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నట్లు స్పష్టమవుతోంది. అంతరిక్ష పరిశోధనలకు అవసరమైన సామగ్రి తయారీ, పరిశోధనలు చేయడం వంటి వాటికి సంబంధించి భారీ స్థాయిలో ఏర్పాట్లు ఉంటాయని భావిస్తున్నారు.

జిల్లాకేంద్రంలో ఎడ్లబండ్ల ప్రదర్శన (ఫైల్)



మద్నూర్‌లో పంచాంగ శ్రవణం (ఫైల్)



పెద్దాయిపల్లిలో జడకొప్పు వేస్తున్న దృశ్యం (ఫైల్)



మద్నూర్‌లో వ్యవసాయ పనులు ప్రారంభిస్తున్న రైతులు (ఫైల్)



వచ్చే వచ్చే విశ్వావసువై..



- కొత్త ఆశలతో ఉగాదికి సన్నద్ధం
- ఊరూరా పంచాంగ శ్రవణానికి ఏర్పాట్లు
- వేడుకగా సాగనున్న ఎడ్ల బండ్ల ఊరేగింపులు
- కుస్తీ పోటీలు, జడకొప్పులు, కోలాటలకూ రెడీ

చీకట్లు కమ్ముకున్న బతుకుల్లో చిరుకాంతులను వెదజల్లాలని, వాడిపోతున్న అనుబంధాలకు ఊపిరిపోసేలా మమతానురాగాలను పూయించి శాశ్వతమైన బంధాలుగా మార్చాలని, వెలవెలబోతున్న ప్రకృతి శోభాయమానంగా శోభిల్లేలా మార్పునకు శ్రీకారం చుట్టి నవ వసంతానికి నాంది పలకాలని కొంగొత్త ఆశలతో కాలం సిద్ధమైంది. ఏటా చైత్ర శుద్ధ పాడ్యమి రోజున తెలుగు సంవత్సరాది ఉగాది పండగ వస్తుంది. ఆదివారం నిర్వహించే ఈ పర్వదినం కోసం పల్లె, పట్నం తేడా లేకుండా అంతా ముస్తాబయ్యింది.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఉగాది అంటేనే జిల్లాలో ప్రధానంగా గుర్తుకొచ్చేవి షడ్రుచుల పచ్చడి.. పంచాంగ శ్రవణం.. కవి సమ్మేళనం.. ఆదివారం ఉదయం ఉగాది పూట దర్వాజలకు మామిడి తోరణాలను కట్టి, కొత్త ఆశలతో పండుగకు స్వాగతం పలుకుతారు. పూజల అనంతరం వేప పువ్వు, మామిడి కాయ, చింత పండు, ఉప్పు, బెల్లం, కారంతో తయారు చేసిన పచ్చడి సేవించడం ఆనవాయితీగా వస్తోంది. పంచాంగ శ్రవణం తప్పనిసరిగా చేస్తారు. పలు గ్రామాలలో ఆలయాల వద్ద ఎడ్ల బండ్ల ఊరేగింపు ఉంటుంది. కొన్నిచోట్ల జడకొప్పులాట, మరికొన్ని చోట్ల ఎడ్ల బండ్లు, ట్రాక్టర్ల ఊరేగింపులు నిర్వహిస్తారు.

పంచాంగ శ్రవణం..

తెలుగు కొత్త సంవత్సరంలో పంచాంగ శ్రవణానికి ప్రాధాన్యత ఉంటుంది. గాలి, వాన, పాడి, పంటల గురించి పంచాంగంలో పేర్కొన్న అంశాలను వేద పండితులు చదివి వినిపిస్తుంటే ప్రజలు ఆసక్తిగా వింటారు. జిల్లా కేంద్రమైన కామారెడ్డి పట్టణంలోని అంగడి బజార్‌లో ఏర్పాటు చేసే ప్రత్యేక వేదికపై ఉగాది పంచాంగ శ్రవణ కార్యక్రమం వైభవంగా జరుగుతుంది. దాదాపు అన్ని ఊళ్లలో ఆలయాల వద్ద పంచాంగ పఠనం ఉంటుంది. ఈసారి వర్షాలు కురిసి, పంటలు బాగా పండుతాయని చెబితే చాలు అందరి కళ్లలో ఆనందం వెల్లివిరుస్తుంది.

సీతారాముల కల్యాణ పత్రిక..

లింగంపేట మండలం బాణాపూర్ గ్రామంలోని రామాలయంలో ఏటా శ్రీరామనవమి రోజున నిర్వహించే సీతారాముల కల్యాణానికి సంబంధించి కల్యాణ పత్రికను ఉగాది రోజున రాసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇదే మండలంలోని పోల్కంపేటలోని హరిహర గోపాలస్వామి ఆలయంలో వందేళ్లుగా పంచాంగ శ్రవణం కొనసాగుతోంది. మూడు తరాలకు చెందిన వేద పండితుల కుటుంబం పంచాంగాన్ని చదువుతోంది.



బస్వన్నపల్లిలో యువకుల కోలాటం (ఫైల్)

జడకొప్పులాటలు..

రాజంపేట మండలం పెద్దాయిపల్లి, దోమకొండ మండలం చింతామణిపల్లిలో పండుగ సందర్భంగా జడకొప్పు ఆడుతారు. గాంధారి మండల కేంద్రంతోపాటు బాన్సువాడ మండలం తిర్మలాపూర్‌లలో హోలీ రోజున జడకొప్పులు అల్లుతారు. ఉగాది రోజున వాటిని విడదీస్తారు. జిల్లాలోని చాలా గ్రామాల్లో ఉగాది సందర్భంగా జడకొప్పులతో పాటు కోలాటాలు ఆడుతుంటారు. మద్నూర్ మండలంలో ఉగాది రోజున వ్యవసాయ పనులను ప్రారంభిస్తారు. ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో యజ్ఞం నిర్వహిస్తారు. పెద్దకొడప్‌గల్ మండలం బేగంపూర్‌లో కోలాటం ఆడుతారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉగాది సందర్భంగా కుస్తీ పోటీలు నిర్వహించడం ఆనావాయితీగా వస్తోంది. నస్రుల్లాబాద్, బీర్కూర్ మండల కేంద్రాల్లో ఉగాది సందర్భంగా కుస్తీ పోటీలు ఉత్సాహంగా సాగుతాయి.

ఎడ్ల బండ్ల ఊరేగింపులు..

ఉగాది పండుగ సందర్భంగా రైతులు ఆలయాల చుట్టూ ఎడ్ల బండ్లతో ఊరేగింపు నిర్వహించే సంప్రదాయం దశాబ్దాలుగా నడుస్తోంది. వ్యవసాయంలో యాంత్రీకరణతో పశువుల సంతతి తగ్గిపోతున్నా ఉగాది రోజున మాత్రం ఎడ్ల బండ్ల ఊరేగింపులకు ఏర్పాట్లు చేసుకుంటారు. కామారెడ్డి పట్టణంలోని అంగడి బజార్‌లో ఏటా పోటాపోటీగా ఎడ్ల బండ్ల ప్రదర్శన జరుగుతుంది. ఎడ్లను ముస్తాబు చేసి ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. దోమకొండ మండల కేంద్రంలో గడి కోట నుంచి ఎడ్ల బండ్ల ఊరేగింపు మొదలై శివరాం మందిర్ ఆలయం మీదుగా బయలుదేరి చాముండేశ్వరి ఆలయం వద్ద ముగుస్తుంది. దోమకొండ సంస్థానాధీశుల వారసులు కూడా ఎడ్ల బండ్ల ఊరేగింపులో పాల్గొంటారు. బీబీపేట మండల కేంద్రంలోని పోచమ్మ ఆలయం వద్ద ఏటా ఎడ్ల బండ్ల ప్రదర్శన ఉంటుంది. మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో మహిళలు బోనాలు కూడా తీస్తారు. బసన్నపల్లిలో కోలాటం ఆడుతారు. రాజంపేట మండల కేంద్రంలో, మాచారెడ్డి మండలం చుక్కాపూర్ లక్ష్మి నర్సింహ స్వామి ఆలయం, భిక్కనూరు మండలం తిప్పాపూర్‌లో ఎడ్ల బండ్ల ప్రదర్శనలు జరుగుతాయి. తాడ్వాయి మండలంలోని తాడ్వాయి, నందివాడ, బ్రాహ్మణపల్లి, బ్రహ్మాజీవాడి, చిట్యాల, దేమికలాన్ గ్రామాల్లో ఎడ్ల బండ్ల ప్రదర్శనలతో పాటు ట్రాక్టర్లు కూడా తిరుగుతాయి.



దోమకొండ సంస్థానాధీశుల ఎడ్ల బండి (ఫైల్)

ఉత్సవాలకు ముస్తాబు

కామారెడ్డి టౌన్: ఉగాది పండుగ సందర్భంగా ఏటా జిల్లా కేంద్రంలో ఎడ్ల బండ్ల ప్రదర్శన నిర్వహిస్తారు. ఇందుకోసం పట్టణ అభివృద్ధి సదరు సంఘం ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాల ఏర్పాట్లు పూర్తి చేశారు. వీక్లీమార్కెట్‌లో ఆదివారం సాయంత్రం ఉగాది ఉత్సవాలు ప్రారంభమవుతాయి. వేదపండితులు పంచాంగ పఠనం చేస్తారు. అనంతరం ఎడ్ల బండ్ల ప్రదర్శన ప్రారంభవుతుంది. ఆయా కుల, యువజన సంఘాల ఆధ్వర్యంలో సుమారు 45 ఎడ్ల బండ్లను అందంగా ముస్తాబు చేసి వీక్లీ మార్కెట్‌లోని దుర్గమ్మ, రాజరాజేశ్వరి, పోచమ్మ ఆలయాల చుట్టూ తిప్పుతారు. అక్కడి నుంచి పాంచ్ రాస్తా, బాలికల స్కూల్, హరిజనవాడ మీదుగా పెద్దమ్మ ఆలయం వరకు ప్రదర్శన సాగుతుంది. అనంతరం ఆలయాల్లో ఘనంగా పూజలు నిర్వహించి మొక్కులను తీర్చుకుంటారు. ఎడ్లబండ్ల ప్రదర్శనను వీక్షించడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు.



ముస్తాబైన దుర్గమ్మ ఆలయం

నవ వసంతానికి కవితా స్వాగతం

వసంత కాలంలో కోకిల గొంతులో రాగాలు పలికే వేళ.. ప్రకృతి పులకించి ఆనంద తాండవం చేసే వేళ.. కొత్త ఆశలతో ఉన్నతమైన విలువలకు ఊపిరి పోసే ఉషస్సుతో విశ్వావసు నామ సంవత్సరానికి కవులు స్వాగతం పలికారు. ఉగాది పర్వదినం సందర్భంగా 'సాక్షి' దినపత్రిక పాఠకుల నుంచి కవితలను ఆహ్వానించింది. 25 మంది కవులు తమ కవితలను పంపించారు. కామారెడ్డికి చెందిన ప్రముఖ కవి, రచయిత డాక్టర్ వి.శంకర్ న్యాయనిర్ణేతగా వ్యవహరించి, ఉత్తమ కవితలను ఎంపిక చేశారు. ఆ కవితలు..

ఆశల భవితకు ఆహ్వానం

కల్మషాల కలతల వాకిళ్లు తుడిచి మమతల చుక్కల ముగ్గులతో
తెలుగింటి సంస్కృతికి అద్దం పట్టే కట్టుబొట్టుతో
ఆరు రుతువుల ఆమని ప్రేమను పంచే ఉగాదితో
శిశిరపు చీకటి వదిలిన చైత్రమాసం చైతన్యంతో
గుప్పెడు గుండె కలల రెక్కల చప్పుడుతో
రేపటి ఆశల భవితకు ఆహ్వానం పలికే కోకిల గానంతో
కులమత వర్ణం లేని లేత మామిడి తోరణాలతో
చేదైన వేప పువ్వుల, తీపి బెల్లం జ్ఞాపకాల దారులతో
ఆరు రుచుల ఆత్మీయత పంచే జీవనగీతంతో
కొత్త ఆశల ఆలోచనలకు అడుగేసే ఉత్సాహంతో
పన్నెండు రాశుల పంచాంగ శ్రవణంతో
ప్రకృతి ఇచ్చిన విజ్ఞానంతో..
వచ్చేవచ్చే విశ్వావసు నామ సంవత్సర ఉగాది

– కవిత, సీటీపల్లి



వసంతం వచ్చింది..

వసంతం వచ్చింది
నవచైతన్యం తెచ్చింది
నునులేత మామిడి చిగురుతిని
కోకిలమ్మ కుహూకుహూ అని కూస్తుంది!
మల్లెపూవుల సౌరభాలు మహిళ సిగలో
వెదజల్లుతుంది
షడ్రుచుల పచ్చడి రుచి చూపిస్తుంది
చలిని దూరం చేస్తూ..
ఎండను అధికము చేస్తూ
పుడమి పులకరిస్తుంది
ప్రకృతి పరవశిస్తుంది!!

– అయ్యవారు మురళి, కల్యాణి గ్రామం, ఎల్లారెడ్డి మండలం



అదే యుగారంభం..

శిశిరం పోయి
వసంతం వచ్చి
ఆకురాలు కాలం పోయి
చిగురించే కాలం వచ్చి
మత్స్యావతారం ధరించి
విష్ణువు సోమకుని సంహరించి
వేదాలను రక్షించే
బ్రహ్మ ప్రారంభించే కాలచక్రం
అదే యుగ ఆరంభం
తెలుగు లోగిళ్లు పచ్చని
మామిడి తోరణాల ప్రకృతి శోభ
విశ్వావసు విశ్వశాంతిని నెలకొల్పాలి !

– డాక్టర్ కాసనవేసి సాహితి, ఒంటారియో (కెనడా)



శుభముల వినగ గోర జేరి..

ఆ.వె. భవిత లెక్కలేసి పంచాంగకర్తలు
జనుల హితముగోరు జ్ఞానధనులు
మంచిచెడుల సవ్య సంచితార్థములెల్ల
తెలియజెప్ప రోజు తెలుసుకొనుడు!
ఆ.వె. అవనినేలు గ్రహము లానంద సమయాన
క్రొత్త పాలనమ్ము కోర్కెదీర్ప
కొలువుదీర నేడు మలుపు లెన్నోగద
వత్సరంపు ఫలిత ముత్సహించ!
ఆ.వె. ప్రియతమ మగువిధము విశ్వావసున గోరి
శాంతిక్రాంతులెల్ల సాధనమున
బడయవలెను గాతభాసిల్ల జగతిన
వత్సరంపు ఫలిత ముత్సహించ!
ఆ.వె. ఈ ఉగాది రోజు నిసుమంత శుభముల
వినగ గోర జేరి జనులొకింత
సత్య వాక్యమేమొ సంతుష్టులంజేయ
వేదమూర్తులార విన్నపములు

– యెనిశెట్టి గంగాప్రసాద్, కామారెడ్డి



బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి

- కులాల వారీగా జనాభా లెక్కలు బయటపెట్టాలి
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్



బీసీ కుల సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత, పక్కన ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : బీసీ రిజర్వేషన్లు అమలయ్యేదాకా పోరాడుదామని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ ఆధ్వర్యంలో శనివారం కామారెడ్డిలో బీసీ కుల సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కవిత మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్న తర్వాత కేసీఆర్ నాయకత్వంలో పదేళ్ల పాటు బీసీలకు డెబ్బై శాతానికి పైగా నిధులు కేటాయించి కుల వృత్తులను బలోపేతం చేశామన్నారు. ఐదుగురు బీసీలకు రాజ్యసభ, ఎనిమిది మందికి ఎమ్మెల్సీ, 55 మందికి కార్పొరేషన్ చైర్మన్లుగా అవకాశం కల్పించామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో బీసీల జనాభా 52 శాతం అని తేలిందని, కాంగ్రెస్ చేసిన కుల సర్వే ద్వారా బీసీల జనాభా తగ్గించి, ఓసీల జనాభాను పెంచారని పేర్కొన్నారు. గ్రామాల వారీగా కులాల వారీగా ప్రభుత్వం జనాభా లెక్కలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. డెడికేషన్ కమిటీ రిపోర్టును ఎందుకు బయటపెట్టడం లేదని ప్రశ్నించారు.

అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ బీసీల కోసం ప్రకటించిన 'కామారెడ్డి డిక్లరేషన్'ను ఎందుకు అమలు చేయడం లేదో రాష్ట్ర ప్రభుత్వం చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. ఎంబీసీ కులాలకు మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో కేవలం రాజకీయ రిజర్వేషన్లు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, తాము చేసిన పోరాటాల వల్ల విద్య, ఉద్యోగ రంగాల్లో కూడా ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్లు పెంచుతూ చట్టాలు చేసిందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని చట్టసభల్లో ఆమోదం పొందిన బీసీ బిల్లుల స్థితిపై ప్రభుత్వం ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. బీసీ బిల్లులు ఆమోదం పొందేలా బీజేపీ నాయకులు కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి బీసీ బిల్లు కోసం పార్టీ పెద్దలతో మాట్లాడాలన్నారు. సమావేశంలో ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, టీఎస్పీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్, గ్రంథాలయ సంస్థ రాష్ట్ర, జిల్లా మాజీ చైర్మన్లు అయాచితం శ్రీధర్, సంపత్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు బాజిరెడ్డి జగన్, షేక్ జుబేర్, రాజేశ్వర్‌రావ్, జాగృతి నాయకులు నవీనాచారి, నరాల సుధాకర్, వివిధ కుల సంఘాల నేతలు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కుల సంఘాల ప్రతినిధులు

బీఆర్‌ఎస్ నేతలు దూరం..

బీసీ కుల సంఘాల రౌండ్ టేబుల్ సమావేశానికి కామారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాలకు చెందిన బీఆర్‌ఎస్ ముఖ్య నేతలు హాజరుకాలేదు. ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సంపత్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ రాజేశ్వర్‌రావ్, బాన్సువాడకు చెందిన మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్, నాయకుడు మోచి గణేశ్ తదితరులు పాల్గొన్నారు. మిగతా రెండు నియోజకవర్గాల నేతలు సమావేశంలో పాల్గొనకపోవడం చర్చనీయాంశంగా మారింది.

సాగునీటి కోసం అన్నదాత కష్టాలు



గౌరారంలో పైప్‌లైన్ వేసి నీరు సరఫరా చేస్తున్న రైతు

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని గౌరారం గ్రామానికి చెందిన రైతు వంజరి శంకర్ తన పొలంలో వరి పంట సాగు చేశాడు. వరి చేతికి వచ్చే దశలో బోరు ఎత్తిపోయింది. దీంతో తన పంటను కాపాడుకోడానికి సుమారు కిలో మీటరు దూరంలో ఉన్న మరో రైతు బోరుబావి నుంచి ఒర్రెలు, ఇతర రైతుల పొలాల్లో నుంచి పైపుల ద్వారా నీరు తీసుకెళ్తున్నాడు. ఆ నీటిని పొలంలో పారిస్తూ, పంటను కాపాడుకుంటున్నాడు.

పంచెకట్టు.. అదిరేట్టు

- ప్రత్యేకతను చాటుకుంటున్న కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి
- దేశ, విదేశాలు ఎక్కడికి వెళ్లినా అదే స్టైల్



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: నాటి ముఖ్యమంత్రి కేసీఆర్, నేటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలను అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించి రికార్డు సృష్టించిన కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఎప్పుడు చూసినా పంచెకట్టులోనే కనిపిస్తారు. తెలుగుదనం ఉట్టిపడేలా పంచెకట్టుతో ఆయన ప్రత్యేకతను చాటుకుంటున్నాడు. దేశ విదేశాలు ఎక్కడికి వెళ్లినా పంచెకట్టులోనే వెళ్తారు. ఆయన ఆహార్యం అందరినీ ఆకట్టుకుంటుంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు నుంచి ఆయన పంచెకట్టులోనే తిరగడం మొదలుపెట్టారు. ఇప్పటికీ అదే పంచెకట్టుతో ఉంటున్నారు. ఆయన ఏ ప్రాంతానికి వెళ్లినా పంచెకట్టు మూలంగా సులువుగా గుర్తు పట్టేస్తుంటారు. ఈసందర్భంగా ఆయన సాక్షితో మాట్లాడుతూ.. 'వైఎస్సార్ అభిమానిగా ఆయన పంచెకట్టు నన్నెంతో ఆకట్టుకునేది. ఆయన అడుగుజాడల్లో నడిచిన నేను కామారెడ్డిలో ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి రెడీ అయ్యాను. అప్పుడే కేసీఆర్ పోటీ చేస్తున్నాడని తెలియడంతో నా ఆహార్యంలో మార్పు ఉండాలనుకున్నాను. దీంతో వైఎస్సార్‌లా పంచె కట్టాలని నిర్ణయానికి వచ్చాను. అప్పటి నుంచి ఎక్కడికి వెళ్లినా పంచెకట్టులోనే వెళతాను' అని అన్నారు. విదేశాలకు వెళ్లినపుడు కూడా చాలా మంది దగ్గరకు వచ్చి కలిశారని, ఆంధ్ర ప్రాంతానికి వెళ్లినపుడు తనను గుర్తు పట్టి, పలకరించి సెల్ఫీలు దిగడానికి పోటీ పడ్డారన్నారు.

డాక్టర్ జీ జన్మదినం స్వయం సేవకులకు పర్వదినం

- ఉగాది రోజున జన్మించిన ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకులు హెడ్గేవార్
- కందకుర్తిలో వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: దేశ అస్తిత్వం, సంస్కృతి, సంప్రదాయాలను నిలబెట్టేందుకు నిరంతరం కృషి చేస్తున్న ఆర్‌ఎస్‌ఎస్‌ను స్థాపించిన డాక్టర్ కేశవ బలిరామ్‌పంత్ హెడ్గేవార్ జన్మించింది ఉగాది రోజునే. విశ్వావసు నామ ఉగాది పర్వదినాన షడ్రుచుల సమ్మేళనంతో చేసిన పచ్చడి తినడంతోపాటు హెడ్గేవార్ జన్మదినం నిర్వహించుకోవడం జిల్లాకు మాత్రమే ప్రత్యేకమని స్వయం సేవక్‌లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. హెడ్గేవార్‌జీ పూర్వీకులు ఇందూరు జిల్లాలోని రెంజల్ మండలం కందకుర్తి నుంచి నాగ్‌పూర్‌కు వలస వెళ్లారు. కందకుర్తిలో హెడ్గేవార్ పూర్వీకుల ఇంటి స్థానంలో ఆయన స్మృతి మందిరం నిర్మిస్తున్నారు. హెడ్గేవార్‌జీ నేపథ్యం కందకుర్తి నుంచే కావడంతో జిల్లా ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. విజయదశమి రోజున కొద్దిమంది చిన్నారులతో హెడ్గేవార్‌జీ ప్రారంభించిన ఆర్‌ఎస్‌ఎస్ నేడు ప్రపంచంలోనే అతిపెద్ద సంస్థగా విరాజిల్లుతోంది. జిల్లా కేంద్రం, కందకుర్తితో పాటు అన్ని మండలాల్లో ఆదివారం సర్వ కుటుంబాలను ఆహ్వానిస్తూ ఉగాది వేడుకలను నిర్వహించేందుకు ఆర్‌ఎస్‌ఎస్ అన్ని ఏర్పాట్లు చేసింది.

కాలభైరవుడికి ఎమ్మెల్సీ కవిత పూజలు



హారతి తీసుకుంటున్న కవిత

రామారెడ్డి: ఇసన్నపల్లి (రామారెడ్డి)లోని కాలభైరవుడి ఆలయాన్ని శనివారం ఎమ్మెల్సీ కవిత సందర్శించారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు, సిబ్బంది కవితకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం కవిత గర్భగుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు, అర్చకులు ఆమెకు ఆశీర్వాదాలు అందించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో 108 గుమ్మడికాయలతో ఏర్పాటుచేసిన దీపాలను కవిత వెలిగించారు. అంతకుముందు ఆమెకు బీఆర్‌ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే సురేందర్‌రెడ్డి, రామారెడ్డి మాజీ ఎంపీపీ బీఆర్‌ఎస్ సీనియర్ నేత దశరథ్‌రెడ్డి, సత్యం రావు, పడిగెల శీను, రాజేందర్ గౌడ్, రవీందర్ రెడ్డి, బుచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌రెడ్డి సేవలు మరువలేనివి



అదనపు కలెక్టర్ దంపతులను గజమాలతో సత్కరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అధికారులు



అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న టీఎన్‌జీవోస్ ప్రతినిధులు

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ఘనంగా అదనపు కలెక్టర్ పదవీ విరమణ సన్మానం

కామారెడ్డి క్రైం/కామారెడ్డి అర్బన్: కామారెడ్డి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా పని చేసి పదవీ విరమణ పొందుతున్న శ్రీనివాస్‌రెడ్డి సేవలు మరువలేనివని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో శనివారం అదనపు కలెక్టర్‌కు ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. శ్రీనివాస్‌రెడ్డి పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలనీ, ఆయురారోగ్యాలతో ఉండాలనీ, సామాజిక సేవల్లో పాల్గొనాలని ఆకాంక్షించారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి దంపతులను గజమాలతో సత్కరించారు. జ్ఞాపికలు అందజేశారు. అలాగే తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం నాయకులు ఆయనను సన్మానించారు. అదనపు కలెక్టర్ విక్టర్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, పలు జిల్లాల అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, జిల్లా అధికారుల సంక్షేమ సంఘం, తెలంగాణ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం, టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ముల్క నాగరాజు, అసోసియేట్ అధ్యక్షుడు చక్రధర్;ప్రతినిధులు దేవరాజు, సాయిలు, లక్ష్మణ్, రాజారెడ్డి, పవన్‌కుమార్, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం ప్రతినిధులు, ఎంపీడీవోల సంఘం, తహసీల్దార్లు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు, బంధువులు పాల్గొన్నారు.

ఘనంగా ఇఫ్తార్ విందు



నస్రుల్లాబాద్‌లో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ప్రజలు



కోనాపూర్‌లో..

నస్రుల్లాబాద్(బాన్సువాడ)/బాన్సువాడ రూరల్/ఎల్లారెడ్డిరూరల్: జిల్లాలోని పలు మండలాల్లో శనివారం పలువురు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులు ఘనంగా కొనసాగాయి. నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో శనివారం బీఆర్‌ఎస్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో హనుమాన్ మాలధార భక్తుడు మైలారం గ్రామానికి చెందిన అల్లం రాము పాల్గొన్నారు. బాన్సువాడ మండలంలోని కోనాపూర్‌లో మాజీ ఉప సర్పంచ్ రాజేశ్వర్‌గౌడ్ ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఎల్లారెడ్డిలో మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ముస్లింలు తదిరతులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలి

భిక్కనూరు: వేసవిలో దొంగతనాలు జరిగే అవకాశాలు ఉన్నాయని ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని భిక్కనూరు ఎస్సై అంజనేయులు కోరారు. మండల కేంద్రంలో శనివారం ఆయన ప్రజలతో మాట్లాడారు. ప్రజలు తమ గ్రామాల్లో అపరిచితులైన వారు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై మహేందర్ ఒక ప్రకటనలో సూచించారు. గ్రామాల్లో గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందివ్వాలని సూచించారు.

ఎల్లారెడ్డిరూరల్: గ్రామాలలో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాలలో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తు దొంగతనాలకు పాల్పడే అవకాశాలున్నాయన్నారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులను గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

ఆర్మీ ఉద్యోగాలకు ఎంపిక

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని జప్తిజాన్కంపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు జోడు సాయిబాబా, మంగ ప్రశాంత్ ఆర్మీ ఉద్యోగానికి ఎంపికయ్యారు. దీంతో శనివారం వారిని గ్రామస్తులు అభినందించారు.

ఎంఈవోకు పదవీ విరమణ సన్మానం

ఎల్లారెడ్డి: మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం పదవీ విరమణ చేయనున్న ఎంఈవో వెంకటేశంను ఎంపీడీవో ప్రకాష్ సన్మానించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ రాజులు, మోడల్‌స్కూల్ ప్రిన్సిపల్ గాంధీ తదితరులున్నారు.





ఎల్ఐసీ ఉద్యోగికి..

కామారెడ్డి అర్బన్: పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయంలో శనివారం కామారెడ్డి నుంచి మెదక్‌కు బదిలీ అయిన ఉద్యోగి వెంకటేశంను బ్రాంచ్ మేనేజర్ కృష్ణమోహన్ సన్మానించారు. ఆయన సేవలను కొనియాడుతు వీడ్కోలు పలిపారు. సిబ్బంది సంపత్‌కుమార్, అనిల్‌కుమార్, లియాఫీ నాయకులు మోహన్, నారాయణరావు, ప్రదీప్ జైన్, క్లియా నాయకులు రాజారెడ్డి మారుతి, రాకేష్, శ్రీధర్ తదితరులున్నారు.

కబ్జా నుంచి భూమిని కాపాడాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని కేశాయిపేట, కోమట్‌పల్లి గ్రామాల శివారులోని అల్లూరమ్మ ఆలయం సమీపంలో ప్రభుత్వ భూమిని కబ్జా కాకుండా కాపాడాలని గ్రామస్తులు కోరారు. ఈమేరకు శనివారం వారు తహసీల్దార్ సురేశ్‌కు, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆలయ పూజారులకు దుస్తుల అందజేత

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని గోపాల్‌పేట నల్ల పోచమ్మ ఆలయం పూజారులకు శనివారం ఆలయకమిటీ చైర్మన్ హన్మంత్‌రెడ్డి దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో ఇద్దరి రిమాండ్

భిక్కనూరు: మండలంలోని భాగిర్తిపల్లి గ్రామంలో ఒకరిపై దాడి చేసిన ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై అంజనేయులు శనివారం తెలిపారు. గంగయ్యగారి యాదగిరి ఇంట్లోకి ఆయన సోదరుడి కుమారులైన రాజశేఖర్, బాబులు అక్రమంగా చొరబడి యాదగిరిపై దాడిచేసి గాయపరిచారు. ఈవిషయమై యాదగిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని రాజశేఖర్, బాబులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై వివరించారు.

తల్లిదండ్రులపై దాడి చేసిన కుమారుడి అరెస్టు

భిక్కనూరు: తల్లిదండ్రులపై దాడి చేసి, గాయపరిచిన కుమారుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు భిక్కనూరు ఎస్సై అంజనేయులు శనివారం తెలిపారు. మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన మంద మల్లేషం ఇటీవల తన తల్లిదండ్రులు దేవయ్య–సిద్దవ్వలపై దాడి చేసి గాయపరిచాడు. ఈవిషయమై కేసు నమోదు చేసుకుని మల్లేషంను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు.

ఉగాది పురస్కారం ప్రదానం



కామారెడ్డి అర్బన్: కామారెడ్డికి చెందిన క్యాతం వెన్నెలకు హైదరాబాద్ సృజన ఆర్ట్ క్రియేషన్స్ వారు ఉగాది పురస్కారాన్ని అందజేశారు. వెన్నెల 52 వారాల పాటు స్ఫూర్తిదాయక కథనాలను ఇంగ్లీషులో అనువాదం చేసినందుకు శనివారం తెలుగు విశ్వవిద్యాలయంలో నిర్వాహకులు బాల నాగేశ్వర రావు పురస్కారాన్ని ప్రదానం చేశారు. భర్త సృజన్, తండ్రి న్యాయవాది సిద్ధిరాములు ఉన్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

ఎల్లారెడ్డి: పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఆర్డీవో మన్నె ప్రభాకర్ అన్నారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో శనివారం పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. హిందూ, ముస్లింల పండుగలు మత సామరస్యానికి ప్రతీకలన్నారు. ప్రతి ఒక్కరు శాంతియుత వాతావరణంలో పండుగలను జరుపుకుని ఆనందంగా ఉండాలన్నారు. తహసీల్దార్ ప్రేమ్‌కుమార్, ఎస్సై మహేష్ తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

గుర్తుతెలియని వ్యక్తి మృతి



ఖలీల్‌వాడి: నగరంలోని జీజీహెచ్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి శనివారం తెలిపారు. ఈ నెల 24న రాత్రి 10 గంటల ప్రాంతంలో జీజీహెచ్‌లోని లిఫ్ట్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో ఉండడంతో చికిత్స కోసం వార్డులోకి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే ఆ వ్యక్తి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి వివరాలు తెలిస్తే ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్‌కు లేదా 87126 59714 నంబర్‌కు సమాచారం అందించాలని తెలిపారు. మృతదేహాన్ని జీజీహెచ్‌లో ఉంచి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

చోరీకి యత్నించిన ముగ్గురి అరెస్ట్

రుద్రూర్: మండలంలోని రాయకూర్ క్యాంపులో తాళం వేసిన ఇంట్లో చోరీకి యత్నించిన ముగ్గురిని శనివారం మధ్యాహ్నం స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాయకూర్ క్యాంపులో దశరథ రామయ్య కుటుంబసభ్యులు కొంతకాలంగా ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఇది గమనించిన దుండగులు శనివారం మధ్యాహ్నం ఇంటి తాళం పగులగొడుతుండగా శబ్దం రావడంతో చుట్టుపక్కలవారు పట్టుకొని పోలీసులకు సమాచారం అందించారు. చోరీకి యత్నించిన వారు బోధన్‌కు చెందిన అశోక్, శ్యామల, సునీతగా గుర్తించారు. నిందితులను రిమాండ్‌కు తరలిస్తామని ఎస్సై సాయన్న తెలిపారు.

పసుపు దొంగల అరెస్ట్.. బెయిల్‌పై విడుదల

బాల్కొండ: ముప్కాల్ మండలం నాగంపేట్ గ్రామానికి చెందిన రైతుల పసుపును కల్లాల వద్ద నుంచి దొంగతనం చేసిన ముగ్గురు దొంగలను శనివారం ముప్కాల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై రజనీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగంపేట్ గ్రామంలో కొల్వి ముత్తెన్నకు చెందిన 10 సంచులు, సల్లా సతీశ్‌రెడ్డికి చెందిన 8 సంచుల పసుపును మెండోరా మండలం వెల్కటూర్ తండాకు చెందిన చవాన్ శంకర్, మాలవత్ గంగాధర్, బనావత్ నవీన్ దొంగిలించారు. దొంగిలించిన పసుపును కారులో తరలిస్తుండగా పట్టుకొని విచారించగా నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. వారి నుంచి సుమారు 9 క్వింటాళ్ల పసుపు, కారును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కోర్టులో హాజరుపర్చగా, సొత్తు రికవరీ కావడంతో నిందితులకు బెయిల్ లభించినట్లు తెలిపారు.

హత్య కేసులో నిందితుడి రిమాండ్

నిజామాబాద్ రూరల్: మహిళ దారుణ హత్య కేసులో నిందితుడు రాజేశ్‌ను శనివారం జిల్లా కోర్టులో ప్రవేశపెట్టినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహమ్మద్ ఆరిఫ్ తెలిపారు. తన తల్లికి చెడు వ్యసనాలు అలవాటు చేస్తుందనే కోపంతో కమలను నగరానికి చెందిన రాజేశ్ ఇటీవల హత్య చేసిన సంగతి తెలిసిందే. కోర్టు ఆదేశాల మేరకు నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని..

- ఇల్లరికం వచ్చిన భర్తను హత్య చేయించిన భార్య



అమృతం విఠల్

బాన్సువాడ : వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని కట్టుకున్న భర్తను భార్య అంతమొందించింది. వివరాలు ఇలా ఉన్నాయి. బాన్సువాడ మండలం నాగారం గ్రామానికి చెందిన అమృతం విఠల్ (38) అనే వ్యక్తి 20 ఏళ్ల క్రితం సోమేశ్వర్ గ్రామంలోని మేనమామ కూతురు కాశవ్వను పెళ్లి చేసుకొని ఇల్లరికం వచ్చాడు. మేస్త్రీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వీరికి ముగ్గురు కుమార్తెలు కాగా, ఒక్కరికి పెళ్లి అయింది. విఠల్ భార్య కాశవ్వ నాగారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. ఈ విషయమై భార్యాభర్తల మధ్య పలు మార్లు గొడవలు జరిగాయి. విఠల్‌ను అంతమొందిస్తే ఏ గొడవా ఉండదని భావించిన కాశవ్వ అదే గ్రామానికి చెందిన అమృతం విఠల్(నిందితుడు), పుల్కంటి విఠల్‌కు విషయం తెలిపింది. శుక్రవారం రాత్రి విఠల్(మృతుడు)ను పొలం వద్దకు తీసుకెళ్లిన అమృతం విఠల్, పుల్కంటి విఠల్ అతిగా మద్యం తాగించి మెడకు టవల్‌తో గట్టిగా బిగించి, పైపులతో కొట్టి చంపారు. అనంతరం విఠల్ మృతదేహాన్ని కొల్లూర్ సబ్‌స్టేషన్ సమీపంలో బాన్సువాడ–బీర్కూర్ ప్రధాన రహదారిపై పడేసి వెళ్లారు. ఉదయం అటుగా వెళ్తున్న కొందరు చూసి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి అన్న బింగి సాయిలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడి భార్య కాశవ్వ, అమృతం విఠల్, పుల్కంటి విఠల్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా, విఠల్‌ను తామే హత్య చేసినట్లు నిందితులు ఒప్పుకున్నారని సీఐ అశోక్ తెలిపారు. నిందితులను రిమాండ్‌కు పంపనున్నట్లు సీఐ పేర్కొన్నారు.

పదో తరగతి ప్రశ్నాపత్రం కేసులో.. వాట్సాప్ గ్రూప్ అడ్మిన్ అరెస్టు

కామారెడ్డి క్రైం: జుక్కల్ మండల కేంద్రంలోని ఓ పదోతరగతి పరీక్షా కేంద్రం నుంచి గణిత ప్రశ్నపత్రంలోని 5 ప్రశ్నలు తెల్లకాగితంపై బయటకు వచ్చిన కేసులో పరారీలో ఉన్న మరొకరిని అరెస్ట్ చేసినట్లు ఎస్పీ రాజేశ్ చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వ్యవహారంలో మొత్తం 11 మందిపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. నిందితుల్లో 8 మందిని మరుసటి రోజు రిమాండ్‌కు తరలించగా ఇద్దరు విలేకరులు, ఓ విద్యార్థి పరారీలో ఉన్నారు. పరారీలో ఉన్న విలేకరి నయీం ఖాన్‌ను శనివారం అరెస్టు చేశామన్నారు. ప్రశ్నల కాగితం ఫొటో బయటకు రాగానే దానిని గంగాధర్ అనే విలేకరి 'జుక్కల్ నియోజకవర్గ సమస్యలు' అనే వాట్సాప్ గ్రూప్‌లో పోస్ట్ చేశాడు. ఆ గ్రూప్‌ను నిర్వహిస్తున్న నయీం ఖాన్ ఆ పోస్టును తొలగించకుండా ఉండటం, పోలీసులకు సమాచారం ఇవ్వకపోవడంతో అతనిపై కూడా కేసు నమోదైందన్నారు.

చికిత్స పొందుతూ యాచకురాలు మృతి

కామారెడ్డి క్రైం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యాచకురాలు చికిత్స పొందుతూ మృతి చెందింది. పట్టణంలోని బీడీ వర్కర్స్ కాలనీకి చెందిన వానరాశి గంగమ్మ (50) భిక్షాటన చేస్తూ జీవనం సాగించేది. శుక్రవారం సాయంత్రం రామారెడ్డి రోడ్డులో ఇంటికి నడుచుకుంటూ వెళుతుండగా అదుపుతప్పిన ఓ బైక్ ఆమెను వెనకనుంచి ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆమెను జనరల్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. వాహనాన్ని అజాగ్రత్తగా నడిపిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్



రాజంపేట: మండలంలోని ఎల్లారెడ్డి గ్రామ పరిధిలో ఇసుక అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. ట్రాక్టర్లను రాజంపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించి, యజమానులపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అరగొండ సెక్షన్ అధికారి సయ్యద్ బాబా, సలీం, బీట్ అధికారులు శ్రీనివాస్, సురేశ్, పద్మారావ్ పాల్గొన్నారు.